
# సత్యవాక్కు

# the word of truth



క్రైస్తవ మాసపత్రిక

AUGUST 1996

# సంక్షిప్తవార్తలు

1996 జూలై నెల 18 వ తేదీ గురువారం, బండార్లంక సమీపములో నున్న నడిపూడి గ్రామములో నిర్మించబడిన ఆలయము అక్కడ యున్న క్రీస్తు సంఘారాధనల కొరకు తెరువబడెను. సోదరుడు దేవరపల్లి అబ్రహాముగారు ఆ గ్రామములోను పరిసర ప్రాంతములలోను అనేక సంవత్సరముల నుండి చేసిన సువార్త పనికి ఫలితముగా దేవుడీ ఆలయమును ఉదార స్వభావముగల దాతలచే నిర్మించారు. సోదరులు జాషువాగూటం గారు రిబ్బను కత్తిరించి ఆలయమును తెరిచారు. తదుపరి జరిగిన కూటములో ఆయన చక్కటి వాక్యోపదేశముగానించారు.త ఆరో; ఇద్దరు బాప్తిస్మముపొందారు. పరిసర ప్రాంతములో యున్నసువార్తికులు అనేకులు ఆకూటమునకు హాజరై నడిపూడి క్రీస్తుసంఘస్థులను, అబ్రహాముగారిని నూతన ఆలయమునిమిత్తం అభినందించారు.

జూలైనెల సువార్తికుల సదస్సు 26వ తేదీన రాజమండ్రి గణేశ్ నగర్‌లో జరిగెను."సంఘము క్రీస్తు నామమును ధరింపవలెనా? ఎందువలన?" అను అంశముపై మరల చర్చకొన సాగెను. (జూన్‌నెలలో పెనుమద్రులో జరిగిన సదస్సులో కూడ యిదే అంశము చర్చింపబడెను. ఆరోజు సమయం సంకుచితమైనందున దీనిని మరల చర్చించుటకు అవకాశము దొరికెను. పెనుమద్రులో సోదరులు ఎ.కాసు గారు సువార్త చేయుచున్నారు. క్రీస్తు పనిలో వారు కుటుంబ సమేతంగా ఆసక్తిగలవారు.)

ఉదయకాల సమావేశమునకు సోదరులు వి.చిన్నయ్యగారు, మధ్యాహ్న సమావేశమునకు యన్.జె.మోహనరావ్ గారు అధ్యక్షులుగా నుండిరి. సోదరులు బి.ప్రసాదరావ్,పి శ్రీరాములు, వి.హిట్లర్,పాల్ గూటం, పి.జి.సువర్ణ రత్నం, ఆర్.సామ్యేలు, ఎలిషే.ప్రభాకరరావ్, ,బి.ధర్మరాజు, ఎ.కాను,యన్.జె.మోహనరావ్ మరియు జాషువా గూటం గార్లు పై అంశమును గూర్చి చక్కటి తలంపుల నిచ్చిరి.

పేరుకు ప్రాముఖ్యము లేదని వాదించే వారున్నారు. క్రీస్తును బాప్తిస్మమిచ్చు యోహానని,ఏలియా అని,యిర్మీయా అని, లేక ప్రవక్తలలో ఒకడని చెప్పుకొనుచున్న జనులను గూర్చి ఆయన సంతషించలేదు. " నీవు సజీవుడవగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" చెప్పిన పేతురును బట్టి ఆయన సంతోషించెను (మత్త 16: 13-17)

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-63722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 17 ఆగష్టు 1996 సంచిక 1

### సంపాదకీయం

## నేను క్రీస్తు నందు ఏల విశ్వాసముంచుచున్నాను

### (Why I believe in Christ)

ప్రపంచమందంతటా కోటానుకోట్ల ప్రజలు యేసుక్రీస్తునందు విశ్వాసముంచుచున్నారు. ఆయన మానవుని పాపముల నిమిత్తమై మరణించి; సమాధి చేయబడి పునరుత్థానుడాయెనని వారు విశ్వసింతురు. ఆయన తండ్రియైన దేవునితో కలిసి రాజులకు రాజుగాను, ప్రభువులకు ప్రభువుగాను పాలించుచున్నాడని, నీతిమంతులను పరలోకమునకు తీసికొని వెళ్లుటకు ఆయన ఒకానొక దినమందు రాబోవుచున్నాడని వారు నమ్ముదురు. ఇది ఇట్లుండగా ఆయన మానవమాత్రుడేయని, మానవ కల్పిత పౌరాణిక పురుషుడని కొందరు చెబుతుంటారు.

ఇటువంటి ప్రతి విషయములోను, కొందరు నమ్మేవారుంటారు. కొందరు

నమ్మని వారుంటారు. కొందరు అంగీకరిస్తారు కొందరు నిరాకరిస్తారు. క్రీస్తు విషయములోను అంతే. క్రీస్తు ఈ లోకంలో జీవించియుండగా ఆయనకున్న అద్భుతశక్తి వలన, ఆయన బోధల వలన దేవుని కుమారుడని అనేకులు అంగీకరించారు. అయితే ఆయన సాతాను సంబంధియని, దేవదూషకుడని చెప్పి ఆయనకు అన్యాయపు తీర్పునిచ్చి సిలువ వేసినవారు అనేకులున్నారు. గనుక శతాబ్దముల తరబడి ఈ వివాదము చెలరేగుచునేయున్నది. ఆయన మరల వచ్చు వరకు అది చెలరేగుచునే యుండును.

క్రీస్తుకు వ్యతిరేకముగా నానా వివాదములు తలెత్తుచున్నను, లోకమందంతటా ఆయన గొప్ప వ్యక్తిగా ఇంకా ఎందుకు చెలామణి అవుచున్నారు? ఇతరుల సంగతి నాకు తెలియదుగాని, క్రీస్తునందు నేనెందుకు విశ్వాసముంచుచున్నానో మీకు తెలియజేయ గోరుదును.

ఆయన ఆదినుండియు దేవునితో నుండెనని, సమస్తము ఆయన మూలముగా కలిగెనని బైబిలు చెప్పుచున్నందున నేను క్రీస్తు నందు విశ్వాసముంచుచున్నాను. దేవుడు "మన పోలిక చొప్పున నరులను చేయుదమని" తలంచారు (ఆది 1:26). ఆ "మన" అనుదానిలో క్రీస్తు ఉండి యున్నారు. ఆయన దేవత్వములో ఒక వ్యక్తి. ఆయన ఆదినుండియు మానవునితో మాట్లాడుచుండిన వాక్యమైన దేవుడు (యోహాను 1:1,2).

క్రీస్తును గూర్చి చెప్పబడిన అనేక ప్రవచనములు, వాటి నెరవేర్పును బట్టి నేను క్రీస్తునందు విశ్వాసముంచుచున్నాను. ఆయన అద్భుత జననము గూర్చి, జీవితమును గూర్చి, మరణ సమాధి పునరుత్థానములను గూర్చి చెప్పబడిన ప్రవచనములున్నాయి. క్రీస్తు "మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరవలెనని నేను మీ యొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని" చెప్పెను (లూకా 24:44).

క్రీస్తు కన్యయైన మరియకు జన్మించినందువలన నేనాయన యందు విశ్వాసముంచుచున్నాను. యిది యెషయా 7:14లో ప్రవచింపబడెను. మత్తయి 1:20-25లో ప్రభువు యొక్క దూత యోసేపుతో ఇట్లనెను: "దావీదు కుమారుడైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము; ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మ వలన కలిగినది. ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను. ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును; ఆయనకు ఇమ్మానుయేలను పేరుపెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము. యోసేపు నిద్రమేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి, తన భార్యను చేర్చుకొని, ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను; అతడు ఆ కుమారునికి యేసు అను పేరుపెట్టెను".

యేసు చేసిన అనేక అద్భుతములను బట్టి నేనాయన యందు విశ్వాసముంచుచున్నాను. ఆయన రోగులను బాగుచేసెను. సముద్రమును నిమ్మళించెను. నీళ్లమీద నడిచెను. నీళ్లను ద్రాక్షరసముగ మార్చెను. ఇంకా అనేక అద్భుతములను చేసెను. ఇవన్నియు ఆయన దేవుని కుమారుడని నిరూపించుటకొరకు చేయబడెను (యోహాను 20:30, 31).

యేసు యొక్క మరణ సమాధి పునరుత్థానములను బట్టి నేను యేసునందు విశ్వాసముంచుచున్నాను. యూదులు యేసును ఒక సూచక క్రియను చేయుమని అడుగగా, "యేసు - ఈ దేవాలయమును పడగొట్టుడి; మూడు దినములలో దాని లేపుదునని వారితో చెప్పెను" (యోహాను 2:19). యెరూషలేములో యున్న దేవాలయమును గూర్చి ఆయన చెప్పెనని వారనుకొన్నారు గాని ఆయన తన

శరీరమైన ఆలయమును గూర్చి అట్లు చెప్పెను. ఆయన పునరుత్థానుడైన తరువాత ఆయన చెప్పిన ఈ మాటలను తన శిష్యులు జ్ఞాపకము చేసికొనిరి.

క్రీస్తునందలి విశ్వాసము నిమిత్తము హింసలను ఓర్చి తమ ప్రాణములను సయితము కోల్పోయిన వారిని బట్టి నేను ఆయన యందు విశ్వాసముంచుచున్నాను. దీనికి పౌలు ఒక మంచి మాదిరిగా యున్నాడు. క్రీస్తు అతనికి కనబడువరకు అతడు సంఘమును హింసించుచు, క్రీస్తు యొక్క శత్రువై యుండెను (అపొ. కా.9). తరువాత అతడు ప్రభువుకు లోబడి తన ప్రాణములను సయితము క్రీస్తు కొరకు అర్పించెను. యోహాను తప్ప మిగతా అపొస్తలులందరును అట్లే. ఆయన మానవ మాత్రుడే అయితే వారుగాని, అనేకులైన యితరులు గాని ఆయన కొరకు చనిపోవుటకు ఎందుకు ఇష్టపడ్డారు? వాస్తవం యేమంటే, ఆయన దేవుని కుమారుడు. మానవులు రక్షింపబడు నిమిత్తం ఆయన చనిపోయెను. అందువలననే వారాయన నిమిత్తం చనిపోవుటకు సయితము సంశయించలేదు.

గత రెండు వేల సంవత్సరములుగా మానవ జాతిపై క్రీస్తుకున్న ప్రభావమును బట్టి నేను క్రీస్తునందు విశ్వాసముంచుచున్నాను. మానవ జాతి చరిత్రను క్రీస్తు మార్చిన రీతిగా ఎవడును మార్చలేడు. మానవుని పనులన్నిటిలో, చరిత్రలో, కళలో, సంస్కృతిలో, సంగీతములో, ఆలోచనలో, అన్నింటిలో క్రీస్తు యొక్క ప్రభావమున్నది.

క్రీస్తు అనుగ్రహించు రక్షణను, నిరీక్షణను, బట్టి నేను క్రీస్తు నందు విశ్వాసముంచుచున్నాను. పాపము నాశనం చేయును, గాని క్రీస్తు రక్షించును (రోమా 6:23; మార్కు 16:16). మనం ఆయనను ఆరాధించి నమ్మకముగా సేవించిన యెడల మనకొక నిత్య జీవ కిరీటాన్ని ఆయన వాగ్దానం చేసారు (ప్రకటన 2:10).

మనం అందరం చనిపోతాం, దేవుని తీర్పులో నిలబడతాం, నిత్యత్వం ఎక్కడో ఒకచోట గడుపుతాం గనుక నేను క్రీస్తునందు విశ్వాసముంచుచున్నాను.

మనకు క్రీస్తు ప్రభువు మాటలను బట్టియే తీర్పు తీర్చబడును (యోహాను 12:48). అందువలన మనం ఆయన యందు విశ్వాసముంచాలి, ఆయన చిత్తానికి లోబడాలి. అప్పుడాయన వాక్యమును బట్టి మనకు తీర్పు తీర్చబడినను మన ఆత్మలకు క్షేమమే కలుగును.

నీవు క్రీస్తునందు విశ్వాసముంచుచున్నావా? అవిశ్వాసికి శిక్ష విధించబడునని బైబిలు చెప్పుచున్నది (మార్కు 16:16). క్రీస్తును మానసికంగా అంగీకరిస్తే సరిపోదు. సరిగదా మనం మారుమనస్సు పొందాలి. నోటితో ఆయనను ఒప్పుకోవాలి. పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి. అంతము వరకు నమ్మకముగా ఆరాధిస్తూ ఆయనను సేవించాలి. అప్పుడు మాత్రమే మన విశ్వాసం మనలను రక్షిస్తాది. నిత్యజీవ నిరీక్షణనిస్తాది.

## "తిరిగి రానివి"

## (Things that will never come Back!)

"ఏ గూటిపిట్ట ఆ గూటికి చేరును" అనే సామెత కలదు. పక్షులు దినమంతా ఆహారం నిమిత్తం పలుచోట్లకు ప్రయాణం చేసినా, రాత్రివేళకు తమ గూటికి తిరిగి వస్తాయి. మానవులు కూడా దినం అంతా ఎక్కడెక్కడో పనిచేసినా సాయంకాలానికి తమ యిల్లు చేరుకొంటారు. అయితే మానవుని జీవితంలో కొన్ని తిరిగి రాని సంగతులున్నాయి. వాటిని తెలుసుకొనుట మంచిది.

### గతించిన కాలం

మొదటిగా గతించిన కాలము తిరిగిరాదు. దేవుడు మనకిచ్చినదంతా ప్రస్తుతమే. అయితే గతాన్ని గూర్చి మనం స్మృతి కలిగియున్నను అదిమాత్రం

తిరిగిరాదు. మోషే యిట్లనుచున్నాడు: "ఆయన నిన్ను సృష్టించిన తండ్రి కాడా? ఆయనే నిన్ను పుట్టించి స్థాపించెను. పూర్వదినములను జ్ఞాపకము చేసికొనుము. తరతరముల సంవత్సరములను తలంచుకొనుము" (ద్వితీయో 32:7). ఎందుకు తలంచుకొనాలి? పూర్వదినములలో దేవుడు నిన్ను కాపాడిన విధానాన్ని బట్టి, ఇప్పుడు నిన్ను ఆశీర్వదించిన విధానాన్ని బట్టి జ్ఞాపకం చేసుకొని ఆయనకు కృతజ్ఞత కలిగియుండాలి. దావీదు గొర్రెల కాపరియే. అయినా దేవుడాతని ఇశ్రాయేలుకు రాజుగా చేసాడు. అందుకే ఇట్లనుచున్నాడు: "యెహోవా నాకు చేసిన ఉపకారములన్నిటికి నేనాయనకేమి చెల్లించుదును? రక్షణ పాత్రను చేత బుచ్చుకొని యెహోవానామమున ప్రార్థన చేసెదను" (కీర్తన 116:12-13).

అపొ. పౌలు కూడ తన పూర్వపు స్థితిని జ్ఞాపకం చేసికొన్నాడు. "పూర్వము దూషకుడను, హింసకుడను, హానికరుడనైన నన్ను తన పరిచర్యకు నియమించి నమ్మకమైన వానిగా ఎంచినందుకు నన్ను బలపరచిన మన ప్రభువైన క్రీస్తు యేసుకు కృతజ్ఞుడనై యున్నాను" అని అతడు చెప్పాడు (I తిమోతి 1:12). అయితే మనం గతంలో జీవించడం అసాధ్యం గనుక "వెనుక ఉన్నవి మరచి, ముందున్న వాటి కొరకై వేగిరపడుచు, క్రీస్తు యేసునందు దేవుని ఉన్నత పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని గురి యొద్దకే పరుగెత్తవలెను"(ఫిలిప్పీ 3:13-14).

## సమయం

ఈ లోకంలో ఏదైనా ప్రశస్తమైనది యున్నదంటే అదిసమయము అని చెప్పక తప్పదు. మానవ జీవితం కూడ ప్రశస్తమైనదే. "రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరివంటివారే" యని భక్తుడైన యాకోబు వ్రాసాడు. కాబట్టి " దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక జ్ఞానుల వలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి. ఇందు నిమిత్తము

మీరు అవివేకులు కాక ప్రభువు యొక్క చిత్తమేమిటో గ్రహించుకొనుడి" యని అపొ. పౌలు హెచ్చరించాడు (ఎఫెసీ 5:15-16).

లూకా సువార్త 13:6-9లో ద్రాక్ష తోటలో యున్న అంజూరపు చెట్టును గూర్చి చెప్పబడింది. మూడేండ్లనుండి దాని పండ్లు వెదుకవచ్చిన యజమానికి ఏమియు దొరకలేదు. అందుకా యజమాని తోటమాలితో దీనిని నరికి వేయుమని చెప్పాడు. అయితే వాడు - అయ్యా ఇంకొక సంవత్సరము కూడ ఉండనిమ్ము. అది ఫలించిన సరి. లేని యెడల నరికించి వేయుమని చెప్పాడు. ఆ అంజూరపు చెట్టు నీవే. నీవు ఫలించునట్లు దేవుడు నీకు సమయాన్ని ఇప్పుడు ఇచ్చాడు. నీవు ఫలించిన సరి. లేనియెడల నరికి వేయబడుదువు. సమయాన్ని సద్వినియోగం చేసుకో.

## జారిన మాట

"ఎవడైనను మాట యందు తప్పని యెడల అట్టివాడు లోపము లేనివాడై తన సర్వ శరీరమును స్వాధీనమందుంచుకొన శక్తి గలవాడగును" అని యాకోబు వ్రాసాడు. అయినను అనేక విషయములలో మనమందరము తప్పిపోవుచున్నామని కూడ అతడు తెలియజేసాడు (యాకోబు 3:2).

మానవుడు అన్నింటికంటె తన నోటిమాటలో ఎక్కువ తప్పిపోవుచున్నాడు. "నాలుక చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును". "దీనితో తండ్రియైన దేవుని స్తుతింతుము, దీనితోనే దేవుని పోలికగా పుట్టిన మనుష్యులను శపింతుము. ఒక్కనోట నుండియే ఆశీర్వచనము, శాపవచనము బయలు వెళ్లును. నా సహోదరులారా, యీలాగుండకూడదు" (యాకోబు 3:3-10).

అందుకే దావీదు, "నాలుకతో పాపము చేయకుండునట్లు నా మార్గములను జాగ్రత్తగ చూచుకొందును; భక్తిహీనులు నా యెదుటనున్నప్పుడు నా నోటికి చిక్కము ఉంచుకొందుననుకొంటిని" యని చెప్పాడు (కీర్తన 39:1). మీరు

బూతులైనను, పోకిరి మాటలైనను, సరసోక్తులైనను ఉచ్చరింపకూడదు, ఇవి మీకు తగవు అని ఎఫెసీ 5:4 హెచ్చరించుచున్నది. గనుక మనం నోటిని అదుపులో యుంచుకోవాలి. ఏలయనగా "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలను బట్టియే నీతిమంతుడవని తీర్పునొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధియని తీర్పునొందుదువు" అని యేసు ప్రభువు చెప్పారు. నీ నోటిని కాచుకో, ఏలయనగా జారిన మాట తిరిగిరాదు!!

- M. ఫిలిప్, భారతిపేట, గుంటూరు -2

మీరు క్రీస్తు సంఘములో బోధకులైనను, కాకపోయినను, ఉద్యోగస్థులైనను విద్యార్థులైనను, గృహిణులైనను కాకపోయినను Basic Bible Course లో చేరండి. క్రొత్త నిబంధన సత్యమును విపులముగా తెలిసికొనండి. ఉచిత పాఠముల కొరకు ఈరోజే దిగువ చిరునామాకు వ్రాయండి :


The Director

**Bible Correspondence Courses**

P.O. Box. 80, KAKINADA - 533 001

# దేనిని గూర్చి చింతించకుడి

## (In nothing be Anxious)

(మత్తయి 6:25 - 34)

యేసుప్రభువు ఇహలోక సంబంధమైన ధనమును గూర్చి హెచ్చరించిన తరువాత పరలోకములో మానవులు ధనమును కూర్చుకొనాలని చెప్పారు. అయితే పరలోక ధనముతో పాటు ఇహలోకధనమును కూడ కాంక్షించు వారి కొరకు మత్తయి 6వ అధ్యాయములోని మిగతాభాగాన్ని ఆయన వినియోగించారు. బీదతనము వలన కలుగు భయం మానవులను ఆవరించుకొనియున్నదని ఆయన ఎరిగిన వాడైయుండి, ఆ భయాన్ని, లేక చింతను నిర్మూలించుటకు ఆయన ప్రయత్నించారు. ఆయన యిట్లు బోధించారు :-

"నేను మీతో చెప్పునదేమనగా - ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారముకంటె ప్రాణమును, వస్త్రము కంటె దేహమును గొప్పవి కావా? అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటె బహుశ్రేష్టులు కారా ? మీలో నెవడు చింతించుటవలన తన యెత్తు మూరెడెక్కువ చేసి కొనగలడు? వస్త్రములను గూర్చి మీరు చింతింపనేల ? అడవి పువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి; అవి కష్టపడవు, ఒకడవు. అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సయితము వీటిలో నొక దాని వలెనైనను అలంకరింప బడలేదు. నేడుండి రేపు పొయిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించిన యెడల,అల్పవిశ్వాసులారా, మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింప జేయునుగదా. కాబట్టి యేమి తిందుమో యేమి త్రాగుదుమో

యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి; అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీపరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును. రేపటిని గూర్చి చింతింపకుడి;రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును; ఏనాటికీడు అనాటికి చాలును" (మత్తయి 6:25 - 34).

## ఆందోళన ప్రయోజన శూన్యం

ఆందోళన చెందడం, చింతించడం ఈ లోకంలో సర్వ సామాన్యమైనది. అది ఒక తెగవారికి గాని, ఒకజాతి వారికిగాని పరిమితి యైనదికాదు. మనం అన్నపానములను గూర్చి, వస్త్రములు వసతిని గూర్చి చింతించుటకు అలవాటు పడినవారము. మనము ఇహలోక సంగతులకు బానిసలము కాకూడదు. అన్నపానములు, వస్త్రముల కంటె ఉన్నతమైనదేదో మన జీవితంలో యున్నది. పరలోకమందు తండ్రియైన దేవుడున్నాడు. ఆయన అడవి గడ్డిని, పువ్వులను, పక్షులను సృష్టించిన వాడు. ఆహారము కంటె శ్రేష్టమైన ప్రాణము నిచ్చిన దేవుడు అప్రాణమును కాపాడుకొనుటకు తప్పక సహాయము చేయును. ఆకాశపక్షులకు ఉచితముగా ఆహారము దయచేయు దేవుడు, నిశ్చయముగా తన బిడ్డలకు ఆహారము ననుగ్రహిస్తాడు. వీటిని గూర్చి చింతించుట వలన మనకు కలుగు ప్రయోజనం శూన్యము.

రాజైన సాలోమోను కున్న వైభము కంటె ఎక్కువగా దేవుడు అడవి గడ్డిని పువ్వులను అలంకరించు చున్నాడు. అల్పజీవరాసులను సృష్టించి వాటిని పోషించుట వలన మనం చింతించనవసరములేదని దేవుడు మనకు గొప్ప నిర్ధారణ యిచ్చు చున్నాడు. ఆకాశ పక్షులు చింతించవు. అడవి పువ్వులు కూడ చింతించవు. అయినను దేవుడు వాటి అవుసరములను తీర్చుచున్నాడు. మనం వీటికంటె శ్రేష్టులము గనుక,. మనము చింతించనవుసరము లేదు.

చింతించుటను గూర్చి ప్రభువు హెచ్చరించారు గాని, భవిష్యత్తును గూర్చినముందు జాగ్రత్తను గూర్చికాదు. భవిష్యత్తును గూర్చి ఆలోచించుట, దానినెదుర్కొనుటకు సిద్ధపడి యుండుట చింతించుట కాదు, ఆందోళన చెందుట కాదుగాని, భవిష్యత్తును ఎదుర్కొనుటకు శక్తిని కలిగియుండుట. ఆందోళన చెందడం ప్రకృతి నేర్పే పాఠాలకు వ్యతిరేకం. చింతింపకుడీ అని కనీసం 4 సార్లు ఈలేఖన భాగంలో ప్రభువు హెచ్చరించారు.

అన్యజనులు మనలను ప్రేమించు పరలోక తండ్రిని గూర్చి యేమి ఎరుగరు గనుక ఏమితిందుమో, ఏమిత్రాగుదుమో, ఏమి ధరించుకొందుమో యని విచారిస్తారు. అయితే క్రైస్తవులు ఇట్టివాటిని గూర్చి చింతించనవుసరం లేదు. వీటిని గూర్చి మీరు చింతింపకుడి యని మన ప్రభువు చెప్పిన తరువాత కూడ మనం చింతించుచుండిన యెడల ప్రభువు యొక్క ఆజ్ఞను ధిక్కరించువారమవుదుము. తాత్కాలిక భౌతికావుసరములకంటె దేవుడు మనకిచ్చిన ప్రాణం ఎంతో గొప్పది.

## ఆందోళనకు విరుగుడు

మన జీవితంలో ప్రభువు యొక్క పనిని జరిగించుటయే ముఖ్యోద్దేశమై యుండాలి. మొదట మనం ఆయన రాజ్యమును నీతిని వెదకాలి. అప్పుడవన్నియు మన కనుగ్రహింపబడును. మన తండ్రియైన దేవుని వాగ్దానములను సంపూర్తిగ మనం నమ్మిన యెడల మనలో నుండి చింత, ఆందోళన వగయిరాలు దూరమవును. మనకు భవిష్యత్తు యేమి తెలియదు. అది తెలియక పోవడమే గొప్ప ఆశీర్వాదము. మన భవిష్యత్తు ముందే మనకు తెలిసి నట్లయితే దానిని గూర్చి గొప్ప ఆందోళన చెందుదుము గదా. అందువలననే రేపేమి సంభవించునో మనకేమియు తెలియకుండ ప్రభువు మనలను సంరక్షించాడు.

ఆందోళనకు విరుగుడు ఒక్కటే. దేవుని యొక్క ప్రేమ మంచి తనము వగయిరాలపై సంపూర్ణ విశ్వాసము కలిగియుండుటయే. ఆందోళన మనకు

హానికరము. రేపటి కీడును గూర్చి ఈనాడే మనం ఆందోళన చెందుచు యున్నట్లయిన యెడల, రేవు జరుగవలసిన దానిని ఈనాడే జరిగేలాగున మనం సంకల్పించుకొంటాము. అందువలన రేపటికీడును గూర్చి ఈరోజే చింతించుట వ్యర్థము. ఒకవేళ రేపేమైనా కీడు సంభవిస్తే దాన్ని అనుభవింపక పోవచ్చు. రేపు దాని శోధనలను కీడులను దానికూడ తీసికొని రావచ్చును. అయితే ఈనాడున్న కీడు ఈనాటికి చాలును. రేపటి కీడు కూడ ఈరోజే అనుభవించి కృంగిపోనవసరం లేదని యేసు ప్రభువు బోధించారు.

ఆందోళనను మనం తప్పించుకోవాలంటే క్రైస్తవులము కావాలి. దేవుడు మనకు తప్పక సహాయం చేస్తాడని గాఢంగా విశ్వసించాలి. ఆయన అద్వితీయ జ్ఞానవంతుడైన దేవుడు (రోమా 16:27). ఆయన మనకు సహాయం చేయగల గొప్పదేవుడు. "ఆయన మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నికంటెను, ఊహించువాటన్నిటి కంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవుడు" (ఎఫెసీ 3:20). "మన ప్రాణము యెహోవా కొరకు కనిపెట్టుకొనుచున్నది. ఆయనే మనకు సహాయమును మనకు కేడెమునై యున్నాడు" (కీర్త 33:21). దేవుడు జ్ఞానవంతుడు, శక్తిమంతుడు, మంచివారు (కీర్త 139:21). మరియు "దేవుని ప్రేమించు వారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము" (రోమా 8:28).

మనం ప్రాణమును గూర్చి దేహమును గూర్చి చింతించరాదని చెప్పుచు యేసు ప్రభువు కొన్ని కారణముల నిచ్చారు. మొదటిగా అన్న వస్త్రముల కంటే ప్రాణము శ్రేష్టమైనది. దేవుడు ప్రాణం యిచ్చాడు గనుక అన్న వస్త్రములు కూడ యిస్తాడు. రెండవదిగా దేవుడు ఆకాశ పక్షులను పోషించుచున్నాడు. అవివిత్తవు, కొట్లలో కూర్చుకొనవు. గాని మనలను మనము పోషించుకొనే విధానాన్ని, జ్ఞానమును

దేవుడు మనకను గ్రహించాడు. మీరు ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరింప జేయగలడు (2 కొరింధీ 9:8; 2 థెస్స 3:10). మూడవదిగా, మన శక్తికి మించిన వాటిని గూర్చి మనం ఆందోళన చెందరాదు. చింతించుట వలన మనలో ఎవడును తన ఎత్తును మూరెడు ఎక్కువ చేసికొనలేడు. ఇవన్నియు మనకు కావలెనని మన పరలోకపు తండ్రికి తెలియును.

మనము మొదట ఆయన రాజ్యమును (అంటే సంఘమును), నీతిని (అనగా ఆయన వాక్యమును) వెదకిన మనకేమి అవసరమో వాటన్నిటిని ఆయన తీర్చును (ఫిలిప్పీ 4:19). "గనుక నీ స్వబుద్ధిని ఆధారము చేసి కొనక నీపూర్ణ హృదయముతో యెహోవా యందు నమ్మక ముంచుము. నీప్రవర్తన అంతటి యందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ త్రోవను సరాళము చేయును" (సామె 3:5,6). యేసు ప్రభువును నమ్మి బాప్తిస్మము పొంది రక్షింపబడుము.(మార్కు 16:16).

- జాషువా గూటం

## క్రీస్తు యోధులు

## (Soldiers of Christ)

క్రొత్త నిబంధన సంఘము దేవుని సైన్యముగా వర్ణించబడినది. నిజానికి క్రీస్తు సంఘము యుద్ధమాడుచున్న ఒక గొప్ప సైన్యముగా మనకు కనబడతాది. ప్రతి క్రైస్తవుడు ఈ ఆత్మీయ సైన్యములో ఒక యోధుడని వర్ణించబడింది. పౌలు తిమోతికి ఇట్లు వ్రాసాడు. "విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము, నిత్యజీవము చేపట్టుము" (1 తిమో 6:12). ఈ మంచి పోరాటము పోరాడాలని అతడు తిమోతిని హెచ్చరించాడు (1 తిమో 1:18). పౌలు తన చివరి ఘడియలలో తన

జీవితాన్ని ఇట్లు సంగ్రహించి చెప్పాడు: "మంచి పోరాటము పోరాడితిని. నా పరుగు కడముట్టించితిని. విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది" (2 తిమో 4:7,8). యేసు ప్రభువు ఈ భూమి మీద అనుగ్రహించి వెళ్లిన విశ్వాసము ప్రశస్తమైనది. క్రైస్తవులు ఆ విశ్వాసము నిమిత్తమై పోరాడాలని చెప్పబడినది (యూదా : 3).

## శారీరక యుద్ధము కాదు

మనం చేసే యుద్ధము శారీరకమైనది కాదని బైబిలు విపులముగా చెప్పుచున్నది. మరియు మన యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవి కూడ కాదు (2 కొరింథీ 10:3,4). "అందుచేత దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి. ఏలయనగా మీ నడుమునకు సత్య సమాధాన సువార్త వలననైన సిద్ధమనస్సను జోడు తొడుగుకొని నిలువబడుడి. ఇవన్నియు గాక విశ్వాసమను డాలు పట్టుకొనుడి దానితో మీరు దుష్టుని అగ్ని బాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు. మరియు రక్షణయను శిరస్త్రాణమును దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి" (ఎఫెసీ 6:14-17).

మన యుద్ధం శరీర సంబంధమైనది కానందున అది యుద్ధము కాకమానదు. సరిగదా మన పోరాటము ప్రమాదకరమైనదని, గొప్ప బలము, విశ్వాసము ప్రయత్నము దీనిలో అవుసరమైయున్నవని క్రొత్త నిబంధన బోధించుచున్నది. ఈ యుద్ధము ఎంత యదార్థమో ఎంత ప్రమాదకరమో పౌలు ఇట్లు వర్ణించాడు. "మనము పోరాడునది శరీరులతో కాదు గాని ప్రధానులతోను అధికారులతోను ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహముతోను పోరాడుచున్నాము" (ఎఫెసీ 6:12).

## శత్రువు - అపవాది

సంఘము యొక్క పరమశత్రువు ఎవడో బైబిలు నందు చెప్పబడియున్నది. "నిబ్బరమైన బుద్ధి గలవారై మెలకువగా యుండుడి. మీ విరోధియైన అపవాది గర్జించు సింహము వలె ఎవని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు...... గనుక విశ్వాసమందు స్థిరులైవానిని ఎదిరించుడి" (1 పేతురు 5:8,9). ఈ గొప్ప శత్రువు బలవంతుడు తంత్రగాడు (ఎఫెసీ 6:11). అతని వెంబడించు గొప్ప సైన్యము అతనికి కలదని మనమెరుగుదుము (1 యోహాను 5:19). మరియు అతడు వారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేస్తాడు (2 కొరింథీ 4:4). గనుక వారిలో అనేకులు ప్రభువు పక్షమున లేకయే ఆయన పక్షమున ఉన్నామనుకొంటారు.

## నీవెవరి పక్షము ?

ఈ యుద్ధము తీవ్రమైనది. మనము ధైర్యముగను, పటిష్టముగను యుండాలి. నీవు ప్రభువు సైన్యములో యున్నావా? నీవు ఆయన పక్షమునైనా యున్నావు లేదా ఆయనకు వ్యతిరేకముగా యున్నావు. నీవాయన కొరకు యుద్ధమాడుట లేని యెడల, అపవాది కొరకు పోరాడుచున్నవాడవగుదువు. యేసు ఇట్లన్నాడు : "నా పక్షమున నుండనివాడు నాకు విరోధి : నాతో కలసి సమకూర్చని వాడు చెదరగొట్టువాడు" (మత్తయి 12:30).

నీవు ఒకప్పుడు ప్రభువు సైన్యములో యుండి పారిపోయినవాడవా? అట్లయితే నీ ప్రభువును విసర్జించినందున నీకు గొప్ప అవమానము. అంతేకాదు ఆయన యొక్క తీక్షణమైన ప్రతిదండనను గూర్చిన భయము నీకు గల్గును (హెబ్రీ 10:26-31;2 పేతురు 2:20-22). నీ వాయన దండులోనికి తిరిగివచ్చిన యెడల ప్రభువు నిన్ను క్షమించి చేర్చుకొనును. నీవు మారుమనస్సు నొంది ఆయన యొద్దకు తిరిగి రమ్ము (1 యోహాను 1:7-9; ప్రకటన 2:4-7).

క్రీస్తు యోధులారా ధైర్యము కలిగి యుండుడి ! "మీ దేవుడైన యెహోవా మీకిచ్చిన మాటచొప్పున తానే మీ కొరకు యుద్ధము చేయువాడు" (యెహోషువ 23:10).

\- బీ.డీ. సిమన్స్

## క్రీస్తు శిష్యుడు

## ( A Disciple of Christ)

నీవు యేసుక్రీస్తు శిష్యుడవా? శిష్యుడు వెంబడించేవాడు, నేర్చుకొనేవాడు. గురువును అంటి యుండువాడు. వివిధ మతాల గురువులకు శిష్యులున్నారు. అయితే నీవు సజీవుడైన దేవుని కుమారుడగు క్రీస్తు శిష్యుడవా? లూకా సువార్త 14వ అధ్యాయంలో ఆయన శిష్యుల నుండి యేసు ఏమి కోరుచున్నాడో ఆయన విపులముగా తెలియజేయుచున్నాడు.

### యేసు సాటిలేని భక్తిని కోరుతున్నాడు

"ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్క చెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటేవాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:26). ద్వేషించాలా? యేసు శిష్యులుగా ఉండాలంటే నిజంగా మన కుటుంబాలను, మిత్రులను ద్వేషించాలా? అట్లు కాదు. ఎందువలనంటే మన పొరుగువారిని, శత్రువులను కూడా మనం ప్రేమించాలని యేసు చెప్పారు గదా! అయితే మనం ఆయన కంటె మరి దేనిని ఎక్కువగా ప్రేమించరాదని ఆయన భావం. యేసుతో మనకున్న సంబంధానికి మధ్య ఇంకో సంబంధాన్ని ఇరికిస్తే అప్పుడు ఆయన శిష్యులము కానేరము. మనం నిరంతరము ఆయన రాజ్యాన్ని వెతిని వెదకాలి (మత్త 6:33).

## యేసు అంతులేని సమర్పణను కోరుచున్నాడు

"మరి ఎవడైనను తన సిలువను మోసుకొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:27). యేసును చంపడానికి ఆయన శత్రువులు సిలువనుపయోగించారు. మన పాపముల ప్రాయశ్చిత్తార్ధమై యేసు తన ప్రాణము బెడుతు ఆయన సిలువను సహించాడు. సిలువ, మరణమునకు గుర్తు. మనం అహంభావానికి, పాపానికి మరణించాలి. క్రీస్తు కొరకు జీవించాలి. పౌలు ఇట్లనుచున్నాడు: "నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడియున్నాను: ఇకను జీవించువాడను నేను కాను: క్రీస్తే నా యందు జీవించుచున్నాడు" (గలతీ 2:20). మనకు మరణము సంభవించినను, లేక మరణించువరకును క్రీస్తు సిలువను మోయుచు యుండాలి (ప్రక 2:10).

లూకా 14:28-32లో యేసు ప్రభువు భవిష్యత్తును ఆలోచిస్తు శిష్యత్వపు మూల్యమును యోచించాలని చెప్పాడు. మనలను ఆయన గోపురమును నిర్మించువానితోను, లేక యుద్ధమునకు పోవురాజుతోను పోల్చుచున్నాడు: విధేయతను నిరుత్సాహపర్చడానికి ఆయన ఈ సంగతులు చెప్పలేదు. పరిగదా ఆయనకు శిష్యులుగా యుండుటలో ఇమిడియున్న సంగతులను నిష్కపటముగా యోచించాలని ఆయన కోరుచున్నాడు. నమ్మకముగా యున్న శిష్యులకు ఆయన ఇచ్చే దీవెనలను కూడా మనం గ్రహించాలని కోరుచున్నాడు. అవి పాపముల నుండి క్షమాపణ జ్ఞానమునకు మించిన సమాధానము. నిత్యజీవము మొదలైనవి (అపొ.కా 2:38; ఫిలిప్పి 4:7-11; యోహా 14:1-3).

## మనం సమస్తమును విసర్జించాలని యేసు కోరుచున్నాడు :

ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచిపెట్టని వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:33). నీకు కలిగిన దంతయు అమ్మివేయాలని గాని,

అందరకు పంచిపెట్టేయ్యాలని గాని ఈవచనం చెప్పటలేదు. అయితే నీకు కలిగిన యావత్తును విసర్జించాలని అది చెప్పుచున్నది. నీవు సువార్తకు లోబడినప్పుడు నీ జీవితాన్ని దానిలోని సమస్తమును క్రీస్తుకు అప్పగిస్తావు. నీవు క్రీస్తు శిష్యునిగా ఉంటూ నీ ఆస్తిని, సంపదను, ప్రజలను స్వార్ధపరుని వలె కలిగియుండలేవు. మనకు కలిగినదంతయూ మన దేహములతో సహా మనదేవుని మహిమ కొరకు వినియోగించాలి. కొరింథులోని క్రైస్తవులకు పౌలు ఇట్లు జ్ఞాపకం చేసాడు: "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు. విలువ పెట్టికొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి" (1 కొరి 6:19-20).

యేసు ప్రభువు తన శిష్యులందరి నుండి సాటిలేని భక్తిని, అంతులేని సమర్పణ జీవితమును, ఇహలోక సంగతుల విసర్జనను కోరుచున్నాడు. మరియు ఆయన శిష్యులు ఇతరులను కూడా శిష్యులనుగా చేయాలని కోరుచున్నాడు; ఆయన ఇట్లనుచున్నాడు : "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి: తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటిని గైకొనవలెనని వారికి బోధించుడి, ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను" (మత్తయి 28:19-20). నీవు క్రీస్తు శిష్యుడవా?

## క్రీస్తు శిష్యుడగుట ఎట్లు?

1. క్రీస్తు సువార్త వినాలి : రోమా 10:14-17; అపొ.కా 15:7; లూకా 8:12,18
2. దేవుని యందును, ఆయన కుమారుడైన క్రీస్తు నందును విశ్వాసముంచాలి : యోహా 3:16; 8:24; అపో. కా 16:31-34, రోమా 10:9; హెబ్రి 11:1,6.

3. మారుమనస్సుపొందాలి. లూకా 13:5; అపో.కా. 17:30

4. క్రీస్తు నందలి నీ విశ్వాసమును ఒప్పుకోవాలి : మత్తయి : 10:32, 33; అపో.కా. 8:37; రోమా 10:9-10

5. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి : మార్కు 16:16, యోహా 3:3-5; అపో.కా. 2:38

ఒకడు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందగా రక్షింపబడిన వాడై దేవుని బిడ్డయగును. అతడు క్రీస్తు సంఘములో ప్రభువుచే చేర్చబడును (అపో.కా. 2:47). క్రీస్తు శిష్యుడు, క్రైస్తవుడగును (అపో.కా. 11:26).

- మార్క్ బైర్డ్

- - 0 - -

## జ్ఞానముతో నడుచుకొనుట

## (Walk in wisdom)

**"వెలుపటి వారియెడల జ్ఞానము కలిగి నడుచుకొనుడి"**

(కొలస్సయులు 4:5)

అపొస్తలుడైన పౌలు కాలములో రోమా అధిపత్యము క్రింద నివసించే తొలి క్రైస్తవులంతా, విగ్రహారాధన, అవినీతి, సుఖభోగములు, అన్యాచారాలు, పద్ధతులు, మొదలగు సమస్యలను, అనునిత్యము ఎదుర్కొనుచుండిరి. ఆసమయములో, కొలస్స పట్టణములో జీవించుచున్న క్రైస్తవులు, అక్కడ జరిగించబడే, మాతృదేవతా రాధన (సిబిలిదేవత) ఆప్రాంతపు ప్రిదియనుల ఆచార, అభిచారక్రియలు, అక్కడ

నివాసము చేయుచున్న గ్రీకుల అన్య సంబంధమైన వేదాంతము, వలస వచ్చిన యూదుల, యూదామత విధానమును ఎదుర్కొన వలసిన స్థితి యుండేది.

అందుకే అక్కడవున్న క్రైస్తవులు వారి ఆచార వ్యవహారములకు లోంగిపోకుండు (కొలస్స 2:16-23) నిమిత్తము మీరు "వెలపటి వారియెడల జ్ఞానము కలిగినడుచుకొనుడి" అనిపౌలు హెచ్చరించెను (కొలస్స 4:5)

ఈనాడు కూడ క్రైస్తవుల మైన మనము ఆసమస్యలనే ఎదుర్కొనుచున్నాము. ఆనాడు వ్రాయబడిన పరిశుద్ధలేఖనములు ఈ ఈనాటి క్రైస్తవులకు కూడ వర్తించబడుచున్నవి.

నిజ క్రైస్తవులు, అన్యమత సిద్ధాంతములకు, రాజకీయములకు దూరంగ వుండాలి. ఆనాటి క్రైస్తవులు గూడ ఈనాటి క్రైస్తవుల మాదిరిగానే దూషించబడి, నిందించబడ్డారు (యూదా 1:12). ఈనాడు కొందరు క్రైస్తవులుగా చెప్పుకొనుచు, బయలుదేవతా ప్రభావము కలిగి, అన్యమతములవారి కంటే ముందు గానే ప్రయాణించుచున్నారు. డినామినేషన్ సంఘములవారు, క్రీస్తు సంఘ సభ్యులను, మతభేదములు కలిగించువారని, వారివలె క్రిస్మస్‌లు, ఈస్టరులు, మట్టలాది వారములు, ఉపవాసకూటములు, పరిశుద్ధాత్మకుమ్మరింపులు జరుపరని, ఆత్మచేతనడిపింపబడరని ప్రచారముచేయుదురు. గనుక మనము వాటిని ఎదుర్కొనుటకు ముందుకునడవాలి.

## దురభిప్రాయమును అధిగమించాలి

యోహాను 5:19లో "మనముదేవుని సంబంధులమనియు,లోకమంతయు దుష్టుని యందున్నది" యనియు వ్రాయబడెను. గనుక ఈ లోకము క్రైస్తవులను సహజముగా ద్వేషించు చునేయున్నది. అయినను అవిధేయులందరిని దేవుని వైపు మళ్లించి, బైబిలును అనుసరించాలని బోదించుట మన కర్తవ్యము. అలా

చేయాలంటే, ముందు, మన ప్రవర్తన యందును, క్రియల ద్వారాను వారిని దేవునియొద్దకు, రప్పించవలెను. అందుకే I పేతురు 2:12లో "అన్యజనులు మిమ్ము ను ఏవిషయములో దుర్మార్గులని దూషింతురో, ఆ విషయములో వారు మీ సత్ క్రియలను చూచి, వాటిని బట్టి దర్శన దినమున దేవుని మహిమ పరచునట్లు వారిమధ్యను, మంచి ప్రవర్తన కలవారై యుండవలెనని మిమ్ము ను బ్రతిమలాడుకొను చున్నాను". మీరు చెప్పువారు నైయుండక చేయువారునై వుండవలెను. మనము చేయు ప్రతి పనియందును దేవుని పనికనుపర్చుట అవసరమైయున్నది. సత్ క్రియలు చేయుట యుందు ఓపికగా వుండాలి.

## ఉద్రిక్తత కలిగిన వారిగా వుండకూడదు

సువార్త ప్రకటించునప్పుడు, సాత్వీకముతో ప్రకటించవలెను. తీర్పుతీర్చువారుగా మాట్లాడకూడదు. గొఱ్ఱెలను, మేకలను, వేరుపరుచువాడు క్రీస్తు (మత్తయి 25:32). యెహాను 5:22, తీర్పు తీర్చుటకు కుమారునికి సర్వాధికారమున్నది అనువాక్యమును మరువరాదు. యోహా 3:16, అందరు (ఆయన యందు విశ్వాసముంచువారు) రక్షణ పొందాలని దేవుని ఉద్దేశ్యమైయున్నది. గనుక మేకలుగా నుండిన వారు గొఱ్ఱెలుగా మారవచ్చును. గనుక మనము ప్రజలకు సువార్తను ప్రకటించు సమయములో వారియడల, దయ, గౌరవము, మర్యాద చూపవలసియున్నది. యాకోబు 3:13, వాడు జ్ఞానముతో కూడిన సాత్వికముగలవాడై తన యోగ్య ప్రవర్తన వలన తన క్రియలను కనపర్చవలెను. అపోస్తులుడైన పౌలు మనము జగడమాడనివారుగా వుండాలి అని హెచ్చరిస్తూ యున్నాడు. మనము వారిని గౌరవించటము ద్వారా, తమ మనస్సును సరైన స్థితి యుందు వుంచుకొని, బైబిలు వాక్యమును విని దానివిలువను గ్రహించ వచ్చును. దాని మూలముగా కొందరు దేవుని మహిమ పరచుదురు (I పేతురు 2:12). ప్రతి మనుష్యునకు ప్రత్యుత్తరము యేలాగు ఇయ్యవలెనో తెలిసికొనుటకై మీ సంభాషణ ఉప్పువేసినట్లు ఎల్లప్పుడు రుచికలదిగాను, కృపా సహితముగా నుండవలెను.

## గౌరవము ప్రదర్శిస్తూ ప్రతి సత్కార్యమునకు సిద్ధముగా నుండాలి

తీతు 3:2 లో పౌలు ఇలా వ్రాస్తున్నాడు: "అధిపతులకును, అధికారులకును లోబడి విధేయులుగా వుండాలనియు ప్రతిసత్కార్యము చేయుటకు సిద్ధపడి వుండవలెననియు, మనుష్యులందరి యెడల సంపూర్ణమైన సాత్వికమును, కనువరచుచు ఎవనిని దూషింపక, జగడమాడని వారుని శాంతులునై వుండవలెననియు వారికి జ్ఞాపకము చేయుము". క్రైస్తవులు అధికారమునకు (రోమా 13:1-6)లోబడుటయే గాక సత్కార్యములు చేయుటకు సిద్ధముగా వుండాలి. ప్రజా సంక్షేమ కార్యక్రమములో పాల్గొని మొదటి వారుగా వుండాలి. దానివలన మనదేవుని మహిమను వెల్లడిపరుచువారముగా వుందుము. (ఫిలిప్పి 2:14-16 వరకు చదువండి). అధికారులను సన్మానించుట యందును, మనము ముందుండాలి (I పేతురు 2:17, 3:15).

## సమస్త మనుష్యులతో సమాధానముగా నుండుడి

రోమాలో నుండిన క్రైస్తవులకు పౌలు హెచ్చరికగా " కీడుకు ప్రతికీడెవరికిని చేయవద్దు. మనుష్యులందరి దృష్టికి యోగ్యమైన వాటిని కలిగివుండుడి. శక్యమైతే మిచేతనైనంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా నుండుడి. ప్రియులారా మీకు మీరే పగతీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటియ్యుడి. పగతీర్చుటనాపని - నేనే ప్రతిఫలమిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది. నీ శత్రువు ఆకలిగొనివుంటే అతనికి భోజనము పెట్టుము. దప్పిక గొనివుంటే దాహమిమ్ము, ఆలాగు చేయుటవలన అతని తల మీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింపబడక మేలు చేత కీడును జయించుము" అనిచెప్పాడు (రోమా 12:17 -21)

## అందరి యెడల మేలు చేయుట

మనము ఇతరులకు చేయు అత్యంతమేలు, మన ప్రభువైన క్రీస్తు ద్వారా దేవునితో సంబంధమును కలిగియుండునట్లు చేయును (రోమా 5:8 - 11). పౌలు కూడ అదే సాక్ష్యమును మనకు పలుకుచున్నాడు. "మరియు ఉపకారమును ధర్మమును చేయ మరచి పోకుడి. అట్టి యాగములు దేవునికి యిష్టములైనవి". (హెబ్రీ 13:16). మనము ఎక్కువగా సంఘములోనున్న వారికి సహాయము చేయుటకు ముందుకు వస్తుంటాము. "కాబట్టి మనకు సమయము దొరికిన కొలది, అందరి యెడలను విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడల మేలు చేయుదము" (గలతి 6:10). యాకోబు 2:15,16, "అందరి యెడల మేలు చేయుదము". అందువలన ఇతరుల దురభిప్రాయము తొలగించి, వారిని దేవుని వైపు మళ్లించుటకు సాధ్యమగును. ఇతరులకు చేసినంత మాత్రమున వారితో సహవాసము చేయుట కాదని గ్రహించాలి. I కొరింధి 15:33, 34, లోకముతో స్నేహము చేయాలని భావము ఇక్కడలేదు. యాకో 4:4 అందరియెడలను ప్రీతి కరముగాను, మంచిగాను వుండగలగితే మనము వారి యొక్క దురభిమానమును నెమ్మదిగా మాన్పించి ప్రభువు యొద్దకు నడిపించగలము.

## "వ్యతిరేకుల నోరు మూయించుట"

మనము ఎదుటి వారియెడలను, ప్రభుత్వము అధికారుల యెడలను, మర్యాదకరముగా వుండినను మనమీద అనేక నిందలు కలుగుట సహజము. మనము అందరికిభయపడువారిగా వుండకూడదు (సామె 29:25 ఎఫె 6:6). మనము అందరికి అనుకూలముగా ప్రయత్నముచేసినను వ్యతిరేకులు అనేకులుందురు. దానియేలు 6:4,5లో ఏవిషయములోను నేరము లేని దానియేలును నేరస్తునిగా ఎంచుటకు ప్రయత్నముచేసిరి. ఎస్తేరు 3:5 నుండి మనము గ్రహించిన నేరములేని యూదులందరిని నాశనముచేయుటకు, హామాను దురాలోచన చేసినట్లు చదివాము. అయినను దేవుడు వానిని తగిన విధముగా శిక్షించాడు. మనుష్యులను సంతోషపెట్టుటకు బైబిలు వాక్యమునకు ఏవేవో కలిపి

భోదించుట దేవుని కిష్టము కాదు (గలతి 1:10). మనము ప్రభువు నిమిత్తము హతసాక్షులుగా వుండాలని భావముకాదు. మనము మనుష్యులందరితో సమాధానముగా వుంటూ, అపొస్తులుల హెచ్చరికలను గైకొనగలము. "ఏలయనగా మీరిట్లుయుక్త ప్రవర్తన కలవారై అజ్ఞానముగా మాటలాడు వారి మూర్ఖుల నోరు మూయుంచుట దేవుని చిత్తము" (I పేతురు 2:15).

చివరగా I పేతురు 3:13-15లో మీరు మంచి విషయములో ఆసక్తి కలవారైతే మీకుహాని చేయు వాడెవడు? మీరొక వేళ నీతి నిమిత్తము శ్రమపడినను మీరు ధన్యులే. వారి బెదిరింపునకు భయపడకుడి, కలవరపడకుడి, నిర్మలమైన మనసాక్షి కలిగినవారై మీలో వున్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతివానికి సాత్వీకముతోను, భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా యుండి, మీహృదయముల యందు క్రీస్తుని ప్రభువుగా ప్రతిష్టించుడి. అప్పుడు మీరు దేని విషయమైతే దుర్మార్గులని దూషింపబడుదురో దాని విషయమై క్రీస్తు నందున్న మీ సత్ ప్రవర్తన మీద అపనిందవేయు వారు సిగ్గుపడుదురు".

ఈ విధంగా నడవటం ద్వారా మనము వెలుపటి వారి యెడల జ్ఞానముతోనడుచుకొను వారమగుదుము (కొల 4:5). అందుకే పౌలు తిమోతికి యిలా వ్రాసాడు: "నిన్ను గూర్చియు, నీభోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము. వీటిలో నిలుకడగా వుండుము. నీవీలాగు చేసి నిన్నును నీబోధవిను వారిని రక్షించుకొందువు" (I తిమోతీ 4:16).

- M.P. మోజెస్, విశాఖపట్టణం

---

గమనిక : మీకు సత్యవాక్కు ఒకటి కంటె ఎక్కువ కాపీలు అందుచున్న యెడల, వాటిపై నున్న కంప్యూటరు నంబరుతో సహా మాకు తెలియజేయండి. సత్యవాక్కును ఇతరులతో పంచుకొనండి.

ఎడిటర్ .

జగత్తు పునాది వేయబడక మునుపే యేసుక్రీస్తు ద్వారా మనలను తన కుమారులనుగా స్వీకరించునట్లు సంఘమును గూర్చిన ఆలోచన దేవుని మనస్సులో ఉండెను,ఆయన తన్ను తాను దాని కొరకు (సంఘము కొరకు) అప్పగించుకొనెను.(ఎఫె 5:25). తన స్వరక్తమిచ్చి దానిని సంపాదించెను.(అ॥కా20:28). క్రీస్తుపేరు లేకుండ క్రీస్తువారమని భావించేవారు శిరస్సులేని శరీరమై యున్నారు.క్రీస్తుశిరస్సునకు బదులు వేరొక శిరస్సుధరించుకోవాలని ఆశించేవారు దేవుని వాక్యపు వెలుగులో వికృతరూపాన్ని కలిగియున్నారు. క్రీస్తు ప్రేమించిన ఆయన వధువును ఆయన నుండి విడదీయజూచువారు అపవాదికి వారసులేగాని క్రీస్తు వారుకాదు. సంఘముకొరకు తనప్రాణముపెట్టిన క్రీస్తుపేరు విడిచినసంఘమును వర్తతముల పేర్లతోను,వారములపేర్లతోను,మానవులపేర్లతోను పిలుచువారు తేవుని సంకల్పమును ఎరుగనివారని సోదరులు హెచ్చరించిరి. ఆదిమసంఘముఏమానపకల్పిత నామముతోను పిలువబడలేదు(రోమా:16:16).క్రీస్తుసంఘముకేథలిక్, ప్రొటస్టాంట్ లేదా యూదామతముకాదు.

యేసుచెప్పెను"నేనునాతండ్రినామమున వచ్చియున్నాను. మీరు నన్ను అంగీకరింపరు.మరియొకడు తననామమున వచ్చినయెడల వానిని అంగీకరింతురు" (యోహా5:43).నేడు దేవదర్శనం కలిగినదని ప్రజల మధ్యకు వచ్చువాడు అంత్యక్రీస్తు అనుచరుడు. వాడు క్రీస్తునకు విరోధి,ఎందుకంటే వాక్యమునకు విరుద్ధమైన భోధలను,నామములను వారుధరించియున్నారు. క్రీస్తుకావాలని ఆశించేవారు క్రొత్తనిబంధన యందలి క్రీస్తు ఉపదేశ క్రమమును అనుసరించవలెను.

పేరుప్రాముఖ్యమైనది. దేవుడు దేనిపేరు దానికిచ్చెను. "క్రీస్తు యేసుమూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమకలుగునుగాక"(ఎఫె3:20-21).మతశాఖలవారు వారిసంఘములకు క్రీస్తుసంఘము అనుపేరుపెట్టుకొనుటకు నిరాకరించుదురు.అయితేయిది క్రీస్తు సంఘముకాదు అని చెప్పలేరు. ఎందుచేతనంటే వారిది మతశాఖ.పేరునుబట్టి ఇది ఎవరిసొత్తు అనువిషయం నిర్ధారించబడును.సంఘముక్రీస్తుదైతే అదిఆయన పేరును ధరించును.

గణేశ్‌నగర్, రాజమండ్రిలో సోదరులు యమ్.కిరణ్‌కుమార్ గారు సువార్తప్రకటించుచున్నారు. కిరణ్‌కుమార్ దంపతులు,స్థానికసంఘము చక్కని ఆతిధ్యమిచ్చి సదస్సును ఘనంగా నిర్వహించిరి.

జూలై 28వ తేదీఆదివారం ఉదయం విజయవాడ దుర్గాపురంలో యున్న క్రీస్తు సంఘ ఆరాధనలో జాషువాగూటం గారు సతీసమేతంగా పాల్గొని చక్కటి సందేశమునిచ్చిరి. స్థానికసోదరులు విశ్వాసములో బలపర్చబడిరి. దుర్గాపురం ఏరియాలో గత 5 సంవత్సరాలుగా సోదరులు  కె.రాజకుమార్ గారు అనేక శ్రమలుఎదుర్కొన్నను మంచి సువార్తపని చేసి చక్కటి సంఘమును నిలబెట్ట గలిగారు. మద్యాహ్నం రెండు గంటలకు విజయవాడ గుణదలలో యున్న క్రీస్తు సంఘస్థుల మధ్య.జాషువా గారు వాక్య పరిచర్య చేసిరి. సోదర సోదరీలు హెచ్చరింపబడిరి. గుణదలలో సోదరులు కె.జాన్ బెర్నార్డ్ గారు మంచి పని చేయుచున్నారు..

---

Regd.No.H/KD -45/K.D H.O
Date of Posting : 15th of Every month

**From:**

**SATYA WAKKU**
**Po.Box. 80**
**KAKINADA-533 001**

**To**